క్లుప్తంగా

గిరిధర్‌ను పరామర్శించిన పేర్ని కిట్టు



మచిలీపట్నంఅర్బన్: జనసేన కార్యకర్తల దాడిలో గాయాలపాలై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిధర్, రాజేష్‌లను శనివారం వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పరామర్శించారు. అనంతరం సత్రపాలెంలోని వారి గృహాలకు వెళ్లి ధ్వంసమైన ప్రదేశాలను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే నార్త్ మండలంలోని గోకవరం పంచాయతీకు చెందిన మర్రి సుబ్బారెడ్డి కాలుకు ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయనను కూడా పేర్ని కిట్టు పరామర్శించారు. కిట్టుతోపాటు కార్పొరేటర్ మీర్ అస్గర్అలీ, వైఎస్సార్ సీపీ నాయకులు లంకే వెంకటేశ్వరరావు, మట్టా మోహన నాంచారయ్య, గణేశన రమేష్, గాజుల నాగరాజు, పిప్పళ్ల నాగబాబు, పిండి శ్యాంబాబు తదితరులు ఉన్నారు.

వెంకట్రామయ్యకు పరామర్శ



నాగాయిలంక(మోపిదేవి): మండలంలోని నాగాయితిప్ప గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు వేములపల్లి వెంకట్రామయ్య అనారోగ్యంతో కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం వారి ఇంటికి వెళ్లి వెంకట్రామయ్యను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, లింగం జగదీష్ కుమార్, బండారు సూరిబాబు, గరికిపాటి గోవిందరాజులు, గరికిపాటి కృష్ణారావు, కోసూరు లెనిన్, తాతా శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువులకు ఉచిత టీకాలు

పెడన: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నాలుగు నెలలు దాటిన పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలను ఉచితంగా వేయనున్నట్లు పెడన పశుసంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ల బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాలి కుంటు వ్యాధి వైరస్ వల్ల సంక్రమిస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని పాడి రైతులు గమనించి సమీపంలోని పశువుల ఆసుపత్రికి తమ పశువులను తీసుకువెళ్లి ఉచిత టీకాలను వేయించాలని ఆయన సూచించారు.

సిలికానాంధ్ర సంజీవిని సేవలు అభినందనీయం



ఘంటసాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు అన్నారు. ఘంటసాల గ్రామంలోని పెద్ద కల్యాణ మండపంలో కూచిపూడికి చెందిన రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ సర్జన్ డాక్టర్ ఏఆర్‌కే శివ ప్రసాద్, గైనకాలజిస్టు డాక్టర్ లిల్లీపాల్, డెంటల్ వైద్యులు శ్వేత, ఆప్తమాలజీ డాక్టర్ పవన్ 200 మందికి వైద్య సేవలందించి ఉచిత మందులను పంపిణీ చేశారు. సంజీవిని వైద్యాలయం ఏఓ, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ హనుమకుమార్, హాస్పిటల్ మేనేజర్ నిమ్మగడ్డ సత్యప్రకాష్, పీఆర్వో తాతా తిరుగణేష్ పాల్గొన్నారు.

వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య



మోపిదేవి: మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం, శ్రీసకలేశ్వరస్వామి ఆలయాల మధ్య ఆర్ అండ్‌బీ రోడ్డులో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. శనివారం దేవస్థానానికి వచ్చిన భక్తుల వాహనాలతో పాటు ప్రయాణికుల వాహనాలతో ఈ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో అక్కడకు వచ్చిన పోలీస్ వాహనం కూడా ట్రాఫిక్‌లో నిలిచిపోయింది. కొద్దిసేపటి తర్వాత వాహనాలు క్రమబద్ధీకరించారు. గ్రామం వెలుపల 216 జాతీయ రహదారి బైపాస్ ఉన్నా కూడా ఇక్కడ ట్రాఫిక్‌లో గంటల తరబడి నిలిచిపోతున్నామని భక్తులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సరైన నిర్ణయంతో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నిరుపయోగంగా అధికారుల బంగ్లాలు

- చిట్టడవిని తలపిస్తున్న రూ. కోట్ల విలువైన స్థలం
- భవనాలపై పెరిగిన మొక్కలు



పిచ్చి మొక్కల మధ్య కమిషనర్ బంగ్లా

మచిలీపట్నంటౌన్: నగరం నడిబొడ్డున జిల్లా రిజిస్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న విలువైన మున్సిపల్ స్థలం చిట్టడవిని తలపిస్తోంది. దాదాపు అర ఎకరం విస్తీర్ణంలో కోట్ల రూపాయల విలువైన స్థలం నిరుపయోగంగా మారింది. ఈ స్థలంలో నగరపాలక సంస్థ కమిషనర్, మున్సిపల్ ఇంజినీరు, హెల్త్ ఆఫీసర్ భవనాలు ఉన్నాయి. ఇవి ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఈ భవనాలపై పిచ్చి మొక్కలు వేపుగా పెరిగి దర్శనమిస్తున్నాయి. భవనాల ఆవరణలోని ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది. టౌన్ ప్లానింగ్ అధికారి కోసం నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణం పునాదుల్లోనే నిలిచిపోయింది. ఈ విలువైన స్థలాన్ని, భవనాలను అధికారులు వినియోగంలోకి తీసుకురాకుండా నిరుపయోగంగా వదిలేయడంపై నగర ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ఖాళీ స్థలాన్ని ఆదాయవనరుగా మార్చుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని నగరప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనర్ బంగ్లాలో గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సత్యవేణి నివాసం ఉండేవారు. అయితే అక్కడ ఆమె నివాసం ఉన్న సమయంలో ఏసీబీ రైడ్ జరగడంతో ఆ తర్వాత వచ్చిన కమిషనర్లు ఈ గృహంలో నివసించేందుకు విముకత చూపుతూ వచ్చారు. ఫలితంగా ఈ గృహం వినియోగంలో లేకపోవడంతో పిచ్చి మొక్కలకు నిలయంగా మారింది. ఈ విలువైన స్థలం ముందే జిల్లా రిజిస్టర్, సబ్ రిజిస్టర్ కార్యాలయాలు, నిర్మల హైస్కూల్ వంటివి ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న ఈ స్థలాన్ని కమర్షియల్‌గా వినియోగించుకుంటే కార్పొరేషన్‌కు ఎంతో ఆదాయం వస్తుందని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఎలాగో పట్టించుకోవడంలేదని పాలకవర్గమైన పట్టించుకుని ఈ స్థలాన్ని ఆదాయవనరుగా మార్చాలని వారు కోరుతున్నారు.



చిట్టడవిని తలపిస్తున్న అధికారుల భవనాల ఖాళీ స్థలం



కమిషనర్ బంగ్లాపై పెరిగిన పిచ్చి చెట్లు

రోడ్డుపైనే మెటీరియల్ డంపింగ్

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

చల్లపల్లి: ఓ ప్రవేటు వెంచర్ కోసం కావాల్సిన రబ్బీషు, రాళ్లతో కూడిన మెటీరియల్‌ను స్థానిక దళితవాడ వద్ద చల్లపల్లి – మచిలీపట్నం సబ్‌హైవేపై నిల్వ చేస్తున్నారు. దీంతో అక్కడ రోడ్డుపై వరకూ గుట్టలు వేయడంతో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందికరంగా మారింది. రాత్రిళ్లు ఎదురుగా వాహనం వచ్చేటప్పుడు లైట్ల వెలుగులో గుట్టలు కనిపించడం లేదని పలువురు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడిందంటే చాలు అక్కడ రోడ్డంతా బురదగా మారి ద్విచక్రవాహనాలు జారి పడిపోతున్నాయని వాపోతున్నారు. మెటిరీయల్‌ను లోడు చేసేందుకు వాడే పొక్లెయిన్ వల్ల రోడ్డు గుంటలు పడి పాడవుతోందని ఆరోపిస్తున్నారు. రామానగరం కమల్ టాకీస్ వద్ద కూడా ఇలాగే మెటీరియల్ దించుకుని వేరే ప్రాంతానికి డంపింగ్ చేసుకోవడంతో అక్కడ కూడా రోడ్డంతా బురదకయ్యగా తయారై ప్రమాదాలకు నిలయంగా మారింది. గత రెండు నెలల నుంచి ఇలాగే ఇరు ప్రాంతాల్లో ప్రవేటు వ్యక్తులు ప్రభుత్వ రోడ్లను, స్థలాలను వాడుకొంటూ ఛిద్రం చేస్తున్నా సంబంధిత అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.



చల్లపల్లి - మచిలీపట్నం సబ్‌హైవేపై దళితవాడ వద్ద రోడ్డుపై వేసిన రబ్బీషు, రాళ్లు



సబ్‌హైవేపై రామానగరం కమల్ టాకీస్ వద్ద బురదకయ్యగా మారిన రోడ్డు ప్రాంతం

డ్రెయిన్ల నిర్మాణానికి కృషి



నాగాయితిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయితిప్ప గ్రామంలో జగనన్న కాలనీని జెడ్పీటీసీ కళ్యాణి కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో 35 గృహాలు మంజూరు అయినట్లు గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ లేఅవుట్‌లో గృహాలు నిర్మించాలంటే ముందుగా మురుగు డ్రెయిన్ కల్వర్టు నిర్మించాల్సి ఉంటుందని చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యులు రాజులపాటి కళ్యాణికి వివరించారు. స్పందించిన జెడ్పీటీసీ కళ్యాణి మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో మాట్లాడి జెడ్పీ నిధుల నుంచి రూ. 6 లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తుల తరపున సర్పంచ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, బండారు సూరిబాబు, లింగం జగదీష్‌కుమార్, గరికిపాటి గోవిందరాజులు, తాతా శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీనగర్ వాకర్స్ భవనంలో ఉదయపు నడక మిత్ర మండలి, విజయవాడ ఒమేగా అనూ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మౌనిక, శ్వేత, దీప్తి రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో వంటి పరీక్షలు ఉచితంగా చేశారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు ఇచ్చారు. శ్రీ ఐ కేర్ ఆప్టొమెట్రిస్ట్ అజయ్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. మిత్రమండలి అధ్యక్షుడు జల్లు మురళీనాథ్, కార్యదర్శి ఘంటశాల రాము, వేద నరసింహం, జోన్ చైర్మన్ కారుమూరి రాజేంద్రప్రసాద్, పూర్వ డెప్యూటీ గవర్నర్ వై.జగన్మోహనరావు, మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి తాండవ కృష్ణ, విన్నకోట సంధ్య, కె. కుమారి పాల్గొన్నారు.

సైలెన్సర్‌తో హల్‌చల్ చేస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ టౌన్: పట్టణంలో ద్విచక్ర వాహనదారులు సైలెన్సర్లతో హల్‌చల్ చేస్తే సహించేది లేదని డీఎస్పీ ధీరజ్ వినీల్ హెచ్చరించారు. శనివారం ద్విచక్ర వాహనాలతో హల్‌చల్ చేసే ఏడుగురిని అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఈ విధమైన శబ్ద కాలుష్య కార్యక్రమాలు అధికమయ్యాయన్నారు. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ఇతర వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఓల్డేజ్ హోమ్‌లు, ఆస్పత్రులు, ఇతర నిషేధిత ప్రాంతాల్లో వీరి చేష్టలు ఇబ్బందికరంగా మారాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సైలెన్సర్లను తొలగించి శబ్దం రాని సైలెన్సర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇది తొలి అపరాధంగా గుర్తించి తక్కువ జరిమానా విధించామన్నారు. ఇకపై ఈ విధమైన కార్యక్రమాలకు పాల్పడే ఏవరినైనా విడిచిపెట్టేదిలేదని రూ.10 వేలు జరిమానా కేసులు సైతం ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ పి. నాగరాజు, ఏఎస్ఐ శంకరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెడన: పెడన – మచిలీపట్నం వెళ్లే మార్గంలోని ఫ్లైఓవర్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. సేకరించిన వివరాల మేరకు.. ఏలూరు నుంచి మచిలీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు, బందరు మండలం బొర్రపోతుపాలెం నుంచి పెడన పెట్రోల్ బంకుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న దావు నాగార్జునను ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగార్జునను స్థానికులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఘటన జరిగిన ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించడంతో సమాచారం అందుకున్న పెడన పోలీసులు వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

మౌలిక వసతులు కరువు

- కప్పలదొడ్డి జగనన్న కాలనీలో తాగునీటి కష్టాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



గూడూరు: రాష్ట్రంలో సొంత ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇల్లు సమకూర్చాలన్న మహోన్నత లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగన్న కాలనీలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండలంలోని కప్పలదొడ్డి గ్రామంలో ఒక్కో లబ్ధిదారులకు సెంటున్నర స్థలం చొప్పున 183 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అంతే కాకుండా వారంతా సొంత ఇల్లు నిర్మించుకోవడానికి గృహ రుణాలు కూడా మంజూరు చేశారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో కాలనీలో వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా లబ్ధిదారులు ఇల్లు కట్టుకునేలా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించారు.

పేరు మార్చి వదిలేశారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న కాలనీల పేరును ఎన్టీఆర్ నగర్‌గా మార్చారు తప్పితే కాలనీలో వసతులను మాత్రం విస్మరించారు. కప్పలదొడ్డి కాలనీలో 183 మంది లబ్ధిదారులకు గాను దాదాపు 90 మందికి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వారిలో 35 మంది గృహప్రవేశాలు పూర్తి చేసి నివాసం కూడా ఉంటున్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకునే దశలో ఉన్నాయి. అయితే కాలనీలో అంతర్గత రహదారులు గానీ, తాగునీటి వసతిగానీ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ పరిసర ప్రాంతంలో భూగర్భ జలాలు ఉప్పగా ఉన్నాయి. దీంతో బావులు తవ్వినా, బోర్లు వేసినా ఉప్పు నీరే వస్తుంది. దీనికితోడు రక్షిత నీటి సరఫరా కూడా లేకపోవడంతో కిలోమీటర్ల మేర వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు కిలోమీటరు దూరంలో ఉన్న చిన్నాకులమన్నాడుకు వెళ్లి టిన్నుల ద్వారా నీరు మోసుకురావాల్సి వస్తోందని వాపోతున్నారు.

నీటి కష్టాలు తప్పడం లేదు



కాలనీ పరిధిలో తాగునీరు దొరకక ఇబ్బందులు పడుతున్నాం. బిందెలు, టిన్నులు నెత్తిన పెట్టుకుని నీరు తెచ్చుకోవాలి. ఎంత కాలం ఈ కష్టాలు పడాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం మా కాలనీకి తాగునీటి వసతి కల్పనపై దృష్టి సారించాలి. నీటి వసతి కల్పిస్తే మరింత మంది ఇళ్లు పూర్తి చేసుకుని రావడానికి సిద్ధంగా ఉన్నారు.

దాసరి అనసూయ, జగనన్న కాలనీ

మా బాధలు వర్ణనాతీతం



కాలనీలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పక్కన ఉన్న చిన్నాకులమన్నాడు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. వర్షాలు పడినప్పుడు మా బాధలు వర్ణనాతీతం. పొలం గట్టులమ్మట వెళ్లి నీరు తెచ్చుకునే క్రమంలో జారి పడిపోతున్నాం. ఇప్పటికైనా మా కాలనీకి రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

అందే కోటేశ్వరరావు, జగనన్న కాలనీ

ప్రభుత్వానికి పట్టడం లేదు



జగనన్న కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్న ఆలోచన అధికారులకు, పాలకులకు రావడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో కాలనీలో వసతుల కల్పనకు ప్రాధాన్యం ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటింది. ఇప్పటి వరకు కాలనీకి తాగునీరు ఇవ్వలేదు.

యక్కల నాగరాజు, వార్డు సభ్యుడు

కోర్టు నోటీసులు కాలదన్ని ఇల్లు కూల్చివేత



కూల్చివేసిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు, జెడ్పీటీసీ కళ్యాణి

మోపిదేవిలంక(మోపిదేవి): ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న ఇంటిని రాత్రికిరాత్రే దౌర్జన్యంగా జేసీబీ సాయంతో టీడీపీ నాయకులు నేలమట్టం చేసిన సంఘటన మండలంలోని మోపిదేవిలంక గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడైన ఈడే మునేశ్వరరావు గత నాలుగు దశాబ్దాల క్రితం పాత ఆర్సీ కరకట్ట, బంజరు భూమిని ఆనుకుని రోడ్డు పక్కన ఇళ్లు వేసుకుని జీవిస్తున్నారు. ఇంటిపన్ను, విద్యుత్ బిల్లులు కూడా చెల్లిస్తున్నారు. అందులో ఆయన కుమారుడు ఈడే విజయ్‌కుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. ఈ క్రమంలో అవకాశం కోసం ఎదురుచూస్తున్న టీడీపీ నాయకులు కూల్చివేతపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు ఇచ్చిన నోటీసులు కూడా తీసుకోకుండా అర్ధరాత్రి జేసీబీతో మహిళలు, పిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇంటిని నేల మట్టం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకోబోయిన భర్త, మామపై దౌర్జన్యం చేయడంతో 108లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు బాధితురాలు ఈడే నాగస్వప్న విలపించింది. ఇళ్లు కూల్చివేసిన విషయం తెలుసుకుని శనివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న అవనిగడ్డ మాజీ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు బాధితులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులనే నెపంతో టీడీపీకి చెందిన వ్యక్తులు ఇంటిని కూల్చివేయడం అన్యాయమన్నారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యులు రాజులపాటి కళ్యాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికటిపాటి వెంకటేశ్వరరావు, జాతీయ మానవ హక్కుల రాష్ట్ర చైర్మన్ రాజులపాటి శివప్రసాద్, పార్టీ నాయకులు మోర్ల శ్రీనివాసరావు, సింహాద్రి వెంకటేశ్వరరావు తదితరులు బాధితులను పరామర్శించారు.

రహదారులు జలమయం



కోడూరు నాయుడుపేట రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

కోడూరు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో శనివారం మధ్యాహ్నం కోడూరులో వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. కోడూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఎడతెరిపి వర్షానికి రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. నాయుడుపేట దగ్గర నుంచి ప్రధాన సెంటర్ వరకు ఇండోర్ స్టేడియం పక్కన ఉన్న మురుగు డ్రెయిన్ పొంగి ప్రవహించింది. డ్రెయిన్‌లోని మురుగునీరు వర్షం నీటితో కలిసి రహదారిపై ప్రవహిస్తూ చెరువును తలపించింది. విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డు, బస్టాండ్ వద్ద నీరు నిలిచిపోవడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. వీవర్స్‌కాలనీ, అంబటి బ్రహ్మణయ్య కాలనీ, వడ్డెర కాలనీల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. మాచవరం, లింగారెడ్డిపాలెం, పిట్టల్లంక, వి.కొత్తపాలెంలో వర్షం ప్రభావానికి అంతర్గత రహదారులు బురదకయ్యలుగా మారాయి.

బందరులో భారీ వర్షం

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండి మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. దీంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు పలు ప్రాంతాల్లోని అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగి పొర్లాయి. రోడ్లపై నీళ్లు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.



కోడూరు ప్రధాన సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



మచిలీపట్నంలో జలమయమైన ప్రధాన రహదారి

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



అవేర్నెస్ వర్క్ షాప్‌లో అధికారులు

కృత్తివెన్ను: ప్రజలందరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని పెదతుమ్మిడి ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కె.పూర్ణ ప్రకాష్ సూచించారు. శనివారం మండలం వెలుగు ఆఫీస్‌లో జరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్ణ ప్రకాష్ మాట్లాడుతూ బ్యాంకుల్లో లభించే వివిధ సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవైసీ, పిన్ నెంబర్లను, ఓటీపీ లాంటి వివరాలను ఇతరులకు చెప్పకూడదని సూచించారు. కృత్తివెన్ను ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సెక్రటరీ పీఎస్ కుమారి, సీసీ నాగేశ్వరరావు, విజయలక్ష్మి, ఏపీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 91 కేసులు పరిష్కారం



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి భాస్కరరావు

బంటుమిల్లి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 91 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు ప్రతినిధులు తెలిపారు. మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, న్యాయమూర్తి ఎం.భాస్కరరావు పర్యవేక్షణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఎస్‌టీసీ, క్రిమినల్ తదితర కేసులను పరిష్కరించారు. కక్షిదారులను సమన్వయపరచి రాజీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి భాస్కరరావు మాట్లాడుతూ కక్షిదారులు న్యాయస్థానాల చుట్టూ తిరిగి తమ విలువైన సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వి. కుటుంబశాస్త్రి, యాళ్ల శ్యాంబాబు, ఆంజనేయులు, పోలీసు సిబ్బంది, పలువురు కక్షిదారులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు.